సాక్షి
ఆదిలాబాద్

గురువారం । 12 । సెప్టెంబర్ । 2024

పారిశుధ్య పనుల పరిశీలన

కైలాస్‌నగర్: బల్దియాలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో బుధవారం ఆయన పర్యటించి శానిటేషన్ పనులు, నీటి సమస్యపై ఆరా తీశారు. మురుగునీరు నిల్వ ఉండకుండా పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. కాలనీ సమస్యలను కౌన్సిలర్ జహీర్ రంజానీని అడిగి తెలుసుకున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫీజు గడువు పెంపు

ఆదిలాబాద్‌టౌన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష దరఖాస్తు గడువు ఈనెల 25 వరకు పొడిగించినట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు స్వీకరించిన దరఖాస్తులను ఈనెల 26లోగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

17న ప్రజా పాలన దినోత్సవం

- జిల్లాకు ముఖ్యఅతిథిగా షబ్బీర్ అలీ

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలును ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈనెల 17న ప్రజా పాలన దినోత్సవం నిర్వహించాలని సంకల్పించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో పాల్గొనే ముఖ్యఅతిథులను ఖరారు చేసింది. ఆదిలాబాద్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ ,కుమురంభీం ఆసిఫాబాద్‌కు మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంచిర్యాల జిల్లాకు ప్రభుత్వ ప్రొటోకాల్ పబ్లిక్ రిలేషన్స్ సలహాదారు హర్కరవేణుగోపాల్‌రావు, నిర్మల్‌కు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ పతాకం ఆవిష్కరించనున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించనున్నారు.

పోలీసు క్యాంటీన్‌లో తక్కువ ధరకే సరుకులు



క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు క్యాంటీన్‌లో తక్కువ ధరకే నిత్యావసర సరుకులు అందిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో గల చక్రపాణి మెమోరియల్ హాల్‌లో పోలీసు క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ క్యాంటీన్ ద్వారా 1500 పోలీసు కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ గౌస్ ఆలం, 2వ బెటాలియన్ కమాండెంట్ నితికపంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



పూజలో పాల్గొన్న ఎంపీ నగేశ్

ఉట్నూర్‌రూరల్:గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాననని ఎంపీ నగేశ్ అన్నారు. బుధవారం ఆయన ఉట్నూర్ మండలంలోని ఏంద, ఉమ్రి గ్రామాల్లో పార్టీ నేత రాథోడ్ రితేశ్‌తో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకులను దర్శించుకొని పూజలు చేశారు. గ్రామస్తులు ఎంపీకి సమస్యలను విన్నవించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు బాలాజీ, జగ్జీవన్, ధన్‌లాల్ ఉన్నారు.

నో రిలీవ్..!





- బదిలీ అయినా.. పాతచోటే విధులు
- జిల్లాలో 268 మంది ఉపాధ్యాయుల నిరీక్షణ
- డీఎస్సీ నియామకాల వరకు అక్కడే..
- రేషనలైజేషన్ నిబంధనల మేరకే అంటున్న అధికారులు

వివరాలు
డీఈవో పరిధిలోని పాఠశాలలు : 648
ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు : 812
రిలీవ్ అయిన వారు : 544
ఇంకా రిలీవ్ కావాల్సింది : 268

ఆదిలాబాద్‌టౌన్: ఏళ్లుగా బదిలీల కోసం ఎదురుచూసిన కొంతమంది ఉపాధ్యాయులకు ఇంకా నిరాశే ఎదురవుతోంది. 2016 తర్వాత ప్రభుత్వం ఇటీవలే బదిలీల ప్రక్రియ చేపట్టింది. చాలామంది ఉపాధ్యాయులు 10 నుంచి 11 ఏళ్లుగా మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి పలుమార్లు బదిలీలు చేపట్టాలని విన్నవించగా, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు స్పందించింది. ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అయితే బదిలీ అయిన పలువురిని రిలీవ్ చేయకపోవడంతో వారంతా పాత చోటే విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇలాంటి వారు జిల్లాలో 268 మంది ఉన్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా 186 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. వీరిని రిలీవ్ చేస్తే ఆ బడులు మూతబడతాయనే ఉద్దేశంతో అక్కడే విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

డీఎస్సీ నియామకాల వరకు అక్కడే..

జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితి దారుణంగా ఉంది. జిల్లాలో మొత్తం ఉపాధ్యాయ పోస్టులు 3004 ఉండగా, ప్రస్తుతం 2349 మంది పనిచేస్తున్నారు. 655 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్క టీచర్‌లేని పాఠశాలలు 18, ఏకోపాధ్యాయ పాఠశాలలు 186ఉన్నాయి. విద్యార్థులు లేక మూతబడ్డ పాఠశాలలు దాదాపు పది వరకు ఉండడం గమనార్హం. అయితే ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు ఇటీవల విద్యార్థుల సంఖ్యకు మించి ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. కాగా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వేసి ఇటీవల ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించింది. ఫలితాలు వెలువడాల్సి ఉన్నాయి. వీరి నియామకాలు జరిగేంత వరకు బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసే అవకాశం లేదు. డీఎస్సీ ద్వారా జిల్లాలో 324 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ ప్రక్రియకు మరో రెండు నెలలు పట్టే అవకాశం ఉంది. అప్పటివరకు వీరు అదే పాఠశాలల్లో పనిచేయాల్సిన పరిస్థితి. అయితే జిల్లాలో ఏకోపాధ్యాయుడు ఉన్న పాఠశాలల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఏదైన పని మీద వెళ్లాలన్నా పాఠశాలకు తాళం వేయాల్సిన దుస్థితి. ప్రభుత్వం ఇటీవల రెండు జిల్లాలకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను భర్తీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాసినప్పటికీ ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు.

మండలాల వారీగా..

మండలం	రిలీవ్ కావాల్సిన వారు
ఆదిలాబాద్‌రూరల్	6
ఆదిలాబాద్‌అర్బన్	33
బజార్‌హత్నూర్	22
బేల	23
భీంపూర్	16
బోథ్	38
గాదిగూడ	16
గుడిహత్నూర్	8
ఇచ్చోడ	35
ఇంద్రవెల్లి	9
నేరడిగొండ	28
సిరికొండ	23
జైనథ్	2
నార్నూర్	2
తలమడుగు	2
తాంసి	2
ఉట్నూర్	2
మావల	1

11 ఏళ్లుగా ఒకే బడిలో..



నేను భీంపూర్ మండలం మందపెల్లి ఎంపీపీఎస్‌లో 11 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాను. ఇటీవల తలమడుగు మండలంలోని సకినాపూర్ పాఠశాలకు బదిలీ జరిగింది. నేను పనిచేసే పాఠశాల ఏకోపాధ్యాయుడితో సాగుతుంది. ఈ బడిని బదిలీల్లో ఎవరూ ఎంచుకోలేదు. దీంతో నన్ను అధికారులు రిలీవ్ చేయలేదు.

–గోపీకృష్ణ,టీయూపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను డీఎస్సీ ద్వారా త్వరగా భర్తీ చేయాలి. బోథ్ మండలం కన్గుట్ట పాఠశాలలో పనిచేస్తున్న నాతో పాటు మరో ఉపాధ్యాయుడికి బదిలీ జరిగింది. నేను ఈ స్కూల్‌లో 2012 నుంచి పనిచేస్తున్నాను. ఇటీవల జైనథ్ మండలంలోని మేడిగూడకు బదిలీ అయినా ఇంకా రిలీవ్ కాలేదు.

– చిల్క సతీశ్, ఎస్టీటీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..



ఇటీవల ఉపాధ్యాయ బదిలీలు జరిగాయి. కొన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు బదిలీల్లో ఎంపిక చేసుకోలేదు. దీంతో ఏకోపాధ్యాయుడు ఉన్న పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని, రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం ఇంకా రిలీవ్ చేయలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం. డీఎస్సీ పరీక్ష పూర్తయింది. ఫలితాలు రావాల్సి ఉన్నాయి. – ప్రణీత, డీఈవో

ఎన్‌సీసీ బలోపేతమే లక్ష్యం



ఎన్‌సీసీ కేడెట్లతో డీడీజీ వి.మధుసూదన్‌రెడ్డి

- ఆదిలాబాద్‌లో అకాడమీ ఏర్పాటుకు కృషి
- ఎన్‌సీసీ డీడీజీ వి.మధుసూదన్‌రెడ్డి

ఆదిలాబాద్: ఆదిలాబాద్‌లో ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎన్‌సీసీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 32 తెలంగాణ బెటాలియన్ యూనిట్ కార్యాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ఎయిర్‌పోర్టు మైదానంలో ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించి సాధ్యాసాధ్యాలను అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్‌సీసీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదిలాబాద్ యూనిట్ కార్యాలయాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో 10 నుంచి 15 ఎకరాల్లో అకాడమీ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నివేదిక అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 23న ఢిల్లీలో ఎన్‌సీసీ జాతీయ స్థాయి సమావేశంలో అకాడమీ ఏర్పాటుకు సంబంధించిన అంశం పరిగణలోనికి తీసుకోనున్నట్లు తెలిపారు. అలాగే కుమురంభీం జిల్లాలోనూ యూనిట్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ఉన్నట్లు వివరించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఎన్‌సీసీ నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ దిశగా ఉన్నతాధికారులకు సైతం నివేదించామని, త్వరలోనే ఎన్‌సీసీలో ఖాళీలు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. కేడెట్ల సంఖ్యకు అనుగుణంగా క్యాంపుల నిర్వహణకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ యూనిట్ పనితీరును కొనియాడారు. అంతకుముందు శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్స్)లో కేడెట్లను కలిసి, మొక్క నాటారు. ఇందులో కల్నల్ సంజయ్ గుప్తా, కల్నల్ సునీల్ అబ్రహం, గ్రూప్ కమాండర్ కౌస్తవ్ మహంతి, కల్నల్ వికాస్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న డీఎఫ్‌వో, ట్రెయినీ కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: అటవీ సంరక్షణలో భాగంగా అమరులైన వారి త్యాగాలు మరువలేనివని జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ అన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మావల మండల కేంద్రంలోని హరితవనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అటవీ ఉద్యోగుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అటవీ సంపదను కొల్లగొట్టే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రెయినింగ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర, అటవీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేశ్ ప్రశాంత్, ప్రవీణ్ మహాజన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఇంద్రవెల్లి: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని బుధవారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దర్బార్ హాల్‌లో ఆదివాసీ పెద్దలతో సమావేశమయ్యారు. జైనూర్ ఘటనకు సంబంధించి వారి అభిప్రాయాలు సేకరించారు. ఆదివాసీ మహిళపై దాడి బాధాకరమని, అందరూ సంయమనం పాటించాలని సూచించారు. నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వదంతులు నమ్మొద్దని, రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావ్, ఆదివాసీ పెద్దలు సిడాం భీంరావ్, మెస్రం వెంకట్‌రావ్, సార్‌మేడీలు చిన్నుపటేల్, జుగాదిరావ్, మనోహర్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ మొగిలి, తదితరులున్నారు.

- సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులకు తప్పని నిరీక్షణ
- ఆరేళ్లుగా ఒకే చోట విధులు..
- స్థానచలనం కోసం ఎదురుచూపు

డీఆర్డీఏలో బదిలీలు లేనట్లేనా..



జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయం

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ జరిగేలా కనిపించడం లేదు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఇటీవల బదిలీలు చేపట్టిన ప్రభుత్వం దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న 40శాతం మంది ఉద్యోగులకు స్థానచలనం కల్పించింది. గత నెలాఖరుతో ఈ ప్రక్రియ సైతం ముగించినట్లుగా ప్రకటించి తిరిగి బదిలీలపై నిషేధం విధించింది. అయితే డీఆర్డీఏ పరిధిలో పనిచేసే సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగుల బదిలీలను మాత్రం విస్మరించింది. దీంతో ఆయా విభాగాల్లో ఆరేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న వారంతా సర్కారు నిర్ణయం కోసం గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. ఇతర ప్రభుత్వ శాఖల మాదిరిగానే తమ బదిలీలకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

రెండు విభాగాల్లో ..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్), జాతీయ గ్రామీణ ఉపాధి (ఈజీఎస్) వంటి రెండు విభాగాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. సెర్ప్ పరిధిలో పనిచేసే ఏపీడీలు, డీపీఎంలు, ఏపీవో పోస్టులకు జోనల్ స్థాయిలో, ఏపీఎంలు, సీసీలకు జిల్లా స్థాయిలో బదిలీలు నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారిలో ఏపీవో, ఈసీలు, జేసీ, డీఆర్‌పీ, డీడీ సీఎల్‌ఆర్‌సీ, డీబీటీ మేనేజర్, ప్లాంట్ సూపర్‌వైజర్ వంటి పోస్టులకు జోనల్‌స్థాయిలో, అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులకు జిల్లాస్థాయిలో బదిలీలు చేపట్టాల్సి ఉంటుంది. అన్ని శాఖల్లో మాదిరిగానే మూడేళ్లకోసారి వీరికి కూడా బదిలీలు నిర్వహించాలనేది ప్రభుత్వ నిబంధన. కానీ ఆయా విభాగాల్లో కొన్నేళ్లుగా బదిలీలు లేవు. దీంతో సదరు ఉద్యోగులు దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేయాల్సి వస్తోంది.

తప్పని నిరీక్షణ

ప్రభుత్వం సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులకు చివరిసారిగా 2018లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం బదిలీల ప్రక్రియ నిర్వహించి స్థానచలనం కల్పించింది. ఇటీవల అన్ని శాఖల మాదిరిగానే డీఆర్డీఏ అధికారులు సైతం తమ శాఖ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిలో 40శాతం మంది ఉద్యోగులను బదిలీ చేసేలా వివరాలు సైతం సేకరించారు. కౌన్సెలింగ్ నిర్వహించేలా కసరత్తు కూడా చేపట్టారు. అయితే మిగతా శాఖల్లో బదిలీల ప్రక్రియ చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం డీఆర్డీఏను మాత్రం విస్మరించింది. ఎలాంటి ఆదేశాలు జారీ చేయకపోవడంతో ఈ శాఖలో బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వ నిర్ణయం కోసం శాఖ ఉద్యోగులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. ఇతర ప్రభుత్వశాఖల్లో మాదిరిగానే తమను బదిలీ చేసేలా వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

- అధికారులతో సమీక్షలో కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలో ఈనెల 17న నిర్వహించనున్న వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్‌శాఖకు సంబంధించి 94408 11700 నంబర్, పోలీస్ శాఖ 87126 59906, మున్సిపల్ 94921 64153, వైద్యఆరోగ్యశాఖ 70131 33369, అగ్నిమాపకశాఖ 8712699212 నంబర్లలో సంప్రదించి సందేహాల నివృత్తితో పాటు సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

వికేంద్రీకరణ వైపు ప్రభుత్వం అడుగులు

ప్రజా సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని అమలు చేస్తుండగా, జిల్లా స్థాయిలో ప్రజావాణిని నిర్వహిస్తోంది. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకుగాను వికేంద్రీకరణలో భాగంగా జిల్లాలోని మూడు మండలాలను పైలెట్ బేస్డ్‌గా ఎంపిక చేసింది. ఆయా మండలాల్లోని ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రజావాణి నిర్వహణకు గాను అధికారులతో కలెక్టర్ రాజర్షి షా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడం, స్థానికంగా సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఏర్పాట్లకు సంబంధించి నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో ఆర్డీవో వినోద్ కుమార్, సంబంధిత అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.


ఆధార్ సెంటర్లు లేని మండలాల్లో కొత్తవి ఏర్పాటు చేయాలి

కైలాస్‌నగర్: ఆధార్ సెంటర్లు లేనటువంటి మండలాల్లో కొత్తవి వచ్చే విధంగా చూడాలని కలెక్టర్ రాజర్షిషా రాష్ట్ర యుఐడీఏఐను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో నాల్గో డిస్ట్రిక్ట్ లెవెల్ ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన పీవీటీజీ పీఎం జన్మన్‌లో భాగంగా మిగిలి ఉన్న ఎన్‌రోల్‌మెంట్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పదేళ్లు దాటిన ప్రజలు తమ ఆధార్‌ను తప్పనిసరిగా సమీపంలోని ఆధార్ సెంటర్‌కు వెళ్లి అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఇందులో సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, అదనపు ఎస్పీ సురేందర్, రాష్ట్ర యుఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ మహమ్మద్ సహోబన్ ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిఘా.. నిద్రలో!



అంబేద్కర్ చౌక్‌లో..



ఎన్టీఆర్ చౌక్‌లో..



పంజాబ్ చౌక్‌లో..

జిల్లా కేంద్రంపై నిరంతర నిఘా ఉంచాలనే ఉద్దేశంతో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లు, ప్రాంతాలు, వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటన్నింటిని అనుసంధానిస్తూ డీఎస్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ సైతం ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం పలుచోట్ల ఈ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో నిఘా ప్రశ్నార్థకంగా మారింది. కాగా, మరో రెండు, మూడు రోజుల్లో నిమజ్జనం నిర్వహించనున్నారు. ఇప్పటికే పలుచోట్ల చోరీలు చోటు చేసుకోవడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



బస్టాండ్ వద్ద



భుక్తాపూర్ వద్ద..

క్లుప్తంగా

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య

నార్నూర్: జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ రహీంపాషా తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జీన్‌గూడకు చెందిన రాజ్‌పంగే చందు (18) ఇంటర్ వరకు చదివాడు. కూలీపని చేస్తూ కుటుంబానికి ఆసరగా ఉంటున్నాడు. నెలరోజులుగా ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో దూకి ఒకరు..



కన్నం పోశెట్టి మృతదేహం

లోకేశ్వరం: చెరువులో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన కన్నం పోశెట్టి (32) మూడేళ్ల క్రితం అప్పులు చేసి దుబాయికి వెళ్లి వచ్చాడు. అప్పులు తీర్చే మార్గం తెలియక మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. దీంతో జీవితంపై విరక్తిచెంది బుధవారం గ్రామ సమీపంలోని బొప్పాయి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సుమలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..

తాంసి: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భీంపూర్ మండలంలోని నిపానిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శివన్న(27) కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా మద్యానికి బానిసకావడంతో అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించగా భీంపూర్ ఎస్సై కలీం మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

భైంసారూరల్: ఈ నెల 9న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బాబుల్‌గాంకు చెందిన సిందే అశోక్ (39) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 9న మ ద్యం మత్తులో పంటపొలంలో పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు ముందుగా భైంసా ఆస్పత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెటిలింగ్ అలవెన్సులో ని'బంధనాలు'

- బిల్లుల చెల్లింపుల్లో వివక్ష
- పూర్తి సర్వీసు చేస్తేనే చెల్లింపులు
- డెత్ కేసుల్లోనూ ఎగవేతే
- నోరు మెదపని కార్మిక సంఘాలు
- ఇకనైనా నిబంధనలు మార్చాలని కార్మికవర్గం డిమాండ్

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో బ్రిటీష్ కాలం నాటి నిబంధనలు వివక్షతను ఎత్తి చూపిస్తున్నాయి. రిటైర్డ్ కార్మికులకు చెల్లించే సెటిలింగ్ అలవెన్స్ ఇందుకు నిదర్శనం. ఈ అలవెన్సు చెల్లింపుల్లో యాజమాన్యం పెట్టిన నిబంధన తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఎన్నో ఏళ్ల నుంచి అమలవుతున్న ఈ నిబంధన క్షుణ్ణంగా పరిశీలిస్తే ఏమాత్రం సహేతుకం కాదనిపిస్తోంది. దీనిపై ఇప్పటికీ ఏ కార్మిక సంఘం కూడా నోరు మెదపలేదు. ఉన్న నిబంధనలే అమలు చేయించడంలో విఫలమవుతున్న నేటి కార్మిక సంఘాల నేతలకు ఇక నిబంధనలు మార్చడానికి కొట్లాడే తీరికెక్కడిదని కార్మికులు విమర్శిస్తున్నారు. అయితే ఇటీవలే ఈ అలవెన్సులపై కార్మికుల్లో చర్చ మొదలైంది. కాలానుగుణంగా ఎన్నో నిబంధనలు మార్చిన కంపెనీ నేడు దీనిపై కూడా దృష్టి సారించాలని కార్మికవర్గం డిమాండ్ చేస్తోంది. ఆర్థికపరమైన ఈ చెల్లింపుల్లో వివక్షత సరికాదని కార్మికులు పేర్కొంటున్నారు.

సెటిలింగ్ అలవెన్సు అంటే..

సింగరేణిలో ఉద్యోగులు రిటైర్డ్ అయిన తరువాత కంపెనీ వారికి సెటిలింగ్ అలవెన్సు చెల్లిస్తుంది. రిటైర్డ్ అయిన కార్మికుని కుటుంబం తిరిగి తన స్వస్థలానికి వెళ్లడం కోసం ఈ అలవెన్సు చెల్లిస్తారు. ట్రాన్స్‌పోర్టు బిల్లులు, హమాలి లోడింగ్, ప్యాకింగ్ చార్జీలన్నీ కలిపి సెటిలింగ్ అలవెన్సు కింద చెల్లిస్తారు. ఇది ఆ కార్మికుడు చివరి నెల బేసిక్ మీద లెక్కించి, తాను పనిచేసే చోటు నుంచి స్వస్థలానికి ఉన్న దూరం కిలోమీటర్ల ప్రకారం లెక్కించి చెల్లిస్తారు. అది కూడా ఉద్యోగి ఈపీఆర్ రికార్డులో నమోదు చేసుకున్న సొంతఊరికి మాత్రమే ఇస్తారు. ఇంకోచోట ఇల్లు ఉందని స్థిరపడటానికి వెళ్తే బిల్లులు ఇవ్వరు. దీనికింద ఒక్కో రిటైర్డ్ కార్మికునికి సుమారు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు వస్తాయి. రిటైర్మెంట్ అయ్యాక అన్ని పత్రాలతో పాటు ఈ బిల్లులు కంపెనీకి సమర్పిస్తేనే ఇవి చెల్లింపు అవుతాయి. లేదంటే ఇవ్వరు. ఇది సర్వీసు పూర్తిగా (సూపరాన్యూయేషన్) చేసిన వారికే వర్తించేలా ఈ అలవెన్సులో నిబంధన ఉంది. ఇప్పుడున్న రిటైర్మెంట్ వయస్సు ప్రకారం 61 ఏళ్లు నిండి రిటైర్డ్ అయిన వారికే చెల్లింపు అవుతున్నాయి.

అన్‌ఫిట్ అయితే ఇవ్వరు...

సెటిలింగ్ అలవెన్సును మెడికల్ అన్‌ఫిట్ (ఇన్‌వాలిడేషన్) అయిన వారికి ఇవ్వడం లేదు. దీంతో వారు ఈ డబ్బులు కోల్పోవాల్సి వస్తోంది. డబ్బులు ఎన్ని అన్న సంగతి అటుంచితే నిబంధనే వింతగా ఉంది. కంపెనీ పాలసీలో ఉన్న లోపభూయిష్ట విధానంలో ఇది ఒకటని చెప్పవచ్చు. అయితే అన్‌ఫిట్ అయిన కార్మికుడి స్థానంలో కంపెనీ డిపెండెంట్‌కు ఉద్యోగం ఇస్తుంది. కంపెనీ క్వార్టర్ కూడా అలాగే ఉంటుంది కాబట్టి ఇక సెటిలింగ్ అలవెన్సు ఎందుకివ్వడమని అధికారులు వాదిస్తున్నారు. అన్‌ఫిట్ అయిన వారిలో కొందరు డిపెండెంట్ ఉద్యోగం తీసుకోవడం లేదు. క్వార్టర్లు కూడా తీసుకోకుండా అన్‌ఫిట్ అయిన వారు ఉన్నారు. అన్‌ఫిట్ అయినా డెత్ అయినా ఏరకంగానైనా ఉద్యోగం నుంచి తప్పుకుంటే తమ కుటుంబాలు స్వస్థలానికో, మరో ఊరికో ముల్లేమూట సర్దుకుని పోవడమే ఉంటుందని కార్మికులు పేర్కొంటున్నారు. అలాంటిది తమకెందుకు ఇవ్వడం లేదో అధికారులే చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.

చనిపోయినా ఇవ్వరు..

గని ప్రమాదంలో చనిపోయినా బయట ఏదైనా ప్రమాదం, అనారోగ్యంతో మృతి చెందిన కార్మికులకు కూడా ఈ అలవెన్సు చెల్లించకపోవడం అమానవీయ చర్యగానే చెప్పవచ్చు. గని ప్రమాదాల్లో చనిపోయిన కార్మికుల పిల్లలు కూడా డిపెండెంట్ ఉద్యోగం తీసుకోని వారున్నారు. క్వార్టర్లు లేని వారు కూడా ఉన్నారు. వీరికి కూడా సెటిలింగ్ అలవెన్సు చెల్లించడం లేదు. సెటిలింగ్ అలవెన్సు ఉద్దేశం కార్మికుని కుటంబం కంపెనీ వదిలి తిరిగి తన స్వస్థలానికి వెళ్లడానికి అయ్యే ఖర్చులు ఇవ్వడమే. దీని ప్రకారమే వీరికి కూడా ఇవ్వడం సహేతుకమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. సెటిలింగ్ అలవెన్సు చెల్లింపుల్లో నిబంధనలు మార్చాలని కార్మికవర్గం డిమాండ్ చేస్తోంది. కొత్తగా గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ నాయకులైనా దీనిపై చొరవ చూపుతారా? లేదా? అన్నది వేచి చూడాలి.

కార్మికుని కుమార్తెకు జాతీయ ర్యాంకు



తల్లిదండ్రులు, సోదరుడితో శ్రీజ

బెల్లంపల్లి: ప్రతిష్టాత్మకమైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)లో పీజీలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో సింగరేణి కార్మికుని కుమార్తె శ్రీజ ప్రతిభ కనబర్చింది. బెల్లంపల్లి సింగరేణి సివిల్ విభాగంలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న దుగుట శ్రీనివాస్, స్వప్న దంపతుల కుమార్తె ఐసీఏఆర్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేయడానికి ఇటీవల ప్రవేశ పరీక్ష రాసింది. మంగళవారం ఫలితాలు వెలువడగా శ్రీజ జాతీయ స్థాయిలో 81వ ర్యాంక్, ఎస్సీ కేటగిరీలో 7వ ర్యాంకు సాధించింది. 1నుంచి 8వ తరగతి వరకు తాండూర్ మండలం రేపల్లెవాడలో ఉన్న సేయింట్ థెరిస్సా పాఠశాలలో, 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్‌లోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో అభ్యసించింది. బీఎస్సీ అగ్రికల్చరల్ నాలుగేళ్ల కోర్సును ములుగులోని ప్రభుత్వ ఫారెస్ట్ కాలేజ్ రీసెర్చ్ ఇనిస్టిస్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ)లో పూర్తి చేసింది.

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం



మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. బుధవారం ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గనిలో వెంటిలేషన్ సమస్య అధికంగా ఉందని, మ్యాన్‌రైడింగ్ యంత్రంపై కుర్చీలు సరిపడా లేవని, టింబర్‌మెన్ కార్మికులు తమపై పనిభారం మోపుతున్నారని వాపోయారు. మేనేజర్‌తో చర్చించి కార్మికుల సమస్యల పరిష్కరిస్తామన్నారు. సింగరేణిలో కొత్తగనులు రావడానికి, పెర్క్స్‌పై ఆదాయ పన్నును రీయింబర్స్‌మెంట్ చేయించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలి



మాట్లాడుతున్న కుమారస్వామి

పాతమంచిర్యాల: ఇందారం గని ప్రమాదంలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలని సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం 1ఏ గనిలో మంగళవారం కార్మికుడు ఏ.శ్రీనివాస్ మొదటి షిఫ్టులో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఊపిరాడక మృతి చెందితే సింగరేణి యాజమాన్యం గని బయట చనిపోయాడని బాధిత కుటుంబానికి ద్రోహం తలపెట్టే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. గనిలోముందస్తు రక్షణ చర్యలు తీసుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జైపాల్‌సింగ్, దేవి సత్యం గోళ్ల అంజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండలంలోని లక్సెట్టిపేట్ బాలుర ఆశ్రమ పాఠశాల, యేంద ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారం అందించాలని, నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో ఏమైనా మరమ్మతులు ఉంటే తమకు తెలియజేయాలన్నారు.

అడవిపందిని ఢీకొని ఒకరు మృతి

ఇంద్రవెల్లి: అడవిపందిని ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. మెండపల్లికి చెందిన శిర్సట్ హనుమాన్ (28) ముత్నూర్‌లో పాన్‌టేలా నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి షాపు మూసివేసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో అడ్డువచ్చిన అడవిపందిని ఢీకొట్టి కిందపడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు ఢీకొని ఒకరు..

మంచిర్యాలక్రైం: మంచిర్యాల–పెద్దంపేట రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్సై ఏ.మహేందర్ బుధవారం తెలిపారు. మంచిర్యాల సమీపంలోని రైల్వేలైన్ కిలోమీటర్ పోల్ నంబర్ 262/22–26 వద్ద ఒకరిని రైలు ఢీకొన్నట్లు అందిన సమాచారం మేరకు ఘటనాస్థలికి వెళ్లి చూడగా మృతదేహం గుర్తుపట్టలేనంతగా ఉందని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఆరెంజ్, నలుపు గీతలు కలిగిన ఫుల్‌షర్టు, బూడిదరంగు ఫార్మల్ ప్యాంటు, తెల్ల బనియన్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు 9701112343, 9618 689879 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ..

సిర్పూర్(టి): సిర్పూర్(టి)–మాకిడి రైల్వేస్టేషన్‌ల మధ్యలో బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి (25) మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతుడు తెల్లని రౌండ్‌నెక్ ఫుల్‌టీషర్టు, బ్లాక్ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. సమాచారం తెలిసిన వారు కాగజ్‌నగర్ రైల్వే పోలీసు స్టేషన్‌లో లేదా 9948481902, 8712658605 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బెల్లంపల్లిరూరల్(తాండూర్): రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఈ.రాజేశ్వర్ తెలిపారు. బుధవారం బెంగళూర్ నుంచి ఢిల్లీకి వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌కు సమీపంలోకి చేరుకోగా గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని వయస్సు సుమారు 20 సంవత్సరాలు ఉంటుందని, పాలపిట్ట రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు 9701112343, 9490871784 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

లక్సెట్టిపేట: ఈ నెల 9న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. ఎల్లారం గ్రామానికి చెందిన బిల్ల మొగిలి (46)ఆటోమొబైల్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులు చేశాడు. తీర్చేమార్గం కనిపించకపోవడంతో ఈ నెల 9న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ఒకరికి ఏడురోజుల జైలు

జైపూర్: న్యూసెన్స్ కేసులో రోర్టు ఒకరికి ఏడురోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. మండలంలోని రసూల్‌పల్లి గ్రామానికి చెందిన కోమటి రాజు అతిగా మద్యం సేవించి డయల్ –100కు ఫోన్‌చేసి విసిగించడంతో ఎస్సై శ్రీధర్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. చెన్నూర్ సివిల్ కోర్టు జడ్జి రవి నిందితునికి ఏడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రైతుల వ్యవసాయ క్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లోంచి ఆయిల్ చోరీకి గురైనట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. మండల కేంద్రంలోని కుంట ప్రాంతంలో ఉన్న వ్యవసాయ క్షేత్రం వద్ద మంగళవారం రాత్రి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ లోంచి గుర్తు తెలియని వ్యక్తులు ఆయిల్ దొంగిలించారు. రైతుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు దొంగల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద ఆంప్లీఫైర్ చోరీ చేసిన ఇద్దరు నిందితులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన షేక్ అర్షద్, మహారాష్ట్రలోని పర్బనికి చెందిన షోయబ్ ఖాన్ పట్టణంలోని మహాలక్ష్మివాడలో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. బుధవారం ఆదిలాబాద్‌లోని నెహ్రూ చౌక్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. పట్టుకున్నవారిలో ఐడీ పార్టీ పోలీసులు రమేశ్, నరేందర్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

కాంట్రాక్టు కన్వేయన్స్ డ్రైవర్ల ధర్నా



ధర్నా చేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్లు

శ్రీరాంపూర్: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ కాంట్రాక్టు కన్వేయన్స్ డ్రైవర్లు బుధవారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ తమ డిమాండ్లు నెరవేర్చాలని గత నెల 29న యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చినా అధికారులు ఏమాత్రం స్పందించలేదన్నారు. దీంతో ఈ నెల 13 నుండి నిరవధిక సమ్మెలోకి దిగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మహేందర్, కాజీపేట రాజేశం, సంపత్ రావు రాజు, సురేష్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలోంచి గొలుసు చోరీ

లోకేశ్వరం: బహిర్భూమికి వెళ్లిన వృద్ధురాలి మెడలోంచి బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన అల్లం గంగవ్వ సోమవారం రాత్రి 8 గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లగా వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోంచి దాదాపు 22 గ్రాముల గొలుసును తెంచుకుని పారిపోయాడు. వృద్ధురాలు తేరుకుని కేకలు వేసినా ఫలితం లేకపోయింది. గొలుసు విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

నర్సాపూర్(జి): మద్యం మత్తులో డయల్ –100కు కాల్ చేసిన వ్యక్తిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన కదం భీంరావు మద్యం మత్తులో మంగళవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో డయల్–100కు కాల్ చేయగా పెట్రోకార్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు వెంకటి, చౌహన్ కృష్ణ గ్రామానికి వెళ్లారు. భీంరావు కాలనీలో న్యూసెన్స్ చేస్తూ కనిపించాడు. కుటుంబ సభ్యులను పిలిచి రోడ్డుపైకి రాకుండా చూసుకొమ్మని చెప్పి వెళ్లిపోయారు. అనంతరం మరో నాలుగుసార్లు కాల్ చేయడంతో బుధవారం న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. డయల్–100కు అత్యవసర సమయంలో మాత్రమే కాల్ చేయాలన్నారు.

వ్యభిచార ముఠా గుట్టు రట్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సీలాల్

- తొమ్మిది మంది అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ బన్సీలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లపై ఇటీవల పోలీసులు నిర్వహించిన దాడుల్లో వ్యభిచార ముఠా పట్టుబడడం హాట్ టాపిక్‌గా మారింది. జన్మభూమి నగర్‌లోని వెంకటేశ్వర లాడ్జిలో ఈనెల 10న రాత్రి తనిఖీలు నిర్వహించగా వ్యభిచారం చేస్తూ నలుగురు మహిళలు, ఆరుగురు పురుషులు పట్టుబడ్డారు. లాడ్జీ ఓనర్ ఏనుగు నారాయణ, మేనేజర్ గోదారి దుర్గయ్య, అతని భార్యను అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. సంబంధిత వివరాలను సీఐ బన్సీలాల్ బుధవారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఓనర్ నారాయణ లాడ్జీ నిర్వహణ బాధ్యతలు చూసుకునేందుకు దుర్గయ్య దంపతులను నియమించాడు. దీంతో ఈజీగా మనీ సంపాదించాలనే దురుద్దేశంతో దుర్గయ్య తన భార్యసాయంతో అమాయకపు మహిళలను టార్గెట్ చేసి వారికి మాయమాటలు చెప్పి షార్ట్ ఫిలిమ్స్‌లో నటిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని నమ్మించి వారిని లాడ్జీకి తీసుకువచ్చేవాడు. విటులను షార్ట్ ఫిలిమ్ డైరెక్టర్లు, నిర్మాతలు అని పరిచయం చేపిస్తూ వారికి చాన్స్ ఇస్తే మీకు షార్ట్ ఫిలిమ్స్‌లో చాన్స్ ఇస్తారని, నటించిన తర్వాత మీకు కొంతడబ్బు ఇస్తారని నమ్మించి వారితో వ్యభిచారం చేయిస్తున్నారు.

ఈ నెల 10న లాడ్జీలో తనిఖీ చేయగా సీసీసీ నస్పూర్‌కు చెందిన మంతెన సాగర్, పెద్దపల్లికి చెందిన బొడ్డుపల్లి శివకుమార్, వేమనపెల్లి మండలం సంపుటంకు చెందిన కూకట్ల పురుషోత్తం, నెన్నెల మండలం కోనంపేటకు చెందిన పెరుగు సాయిప్రసాద్, మెట్‌పల్లికి చెందిన బెడ్డల రాహూల్, మందమర్రికి చెందిన కన్నం శ్రావణ్ కుమార్‌లతో పాటు లాడ్జీ ఓనర్ నారాయణ, నిర్వాహకుడు దుర్గయ్య దంపతులతో పాటు నలుగురు మహిళలు పట్టుబడడంతో అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అభినందించిన సీపీ శ్రీనివాసులు

జిల్లా కేంద్రంలో వ్యభిచార ముఠా గుట్టు రట్టు చేసిన సీఐ బన్సీలాల్, సిబ్బందిని రామగుండం సీపీ శ్రీనివాసులు, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ అభినందించారు.

పత్తి మొక్కలు ధ్వంసం చేశారని ఫిర్యాదు



పత్తి మొక్కలు చూపుతున్న రైతు దంపతులు

నెన్నెల: అటవీ భూముల్లో సాగు చేశారన్న కారణంతో పూతకొచ్చిన పత్తి మొక్కలను అటవీశాఖ అధికారులు మంగళవారం రాత్రి పీకేశారని మండల కేంద్రానికి చెందిన రైతు దంపతులు జంబి పోశం, పద్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నెన్నెల శివారు సర్వే నం.672/25లో ఉన్న ఐదెకరాల పట్టాభూమిలో 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. 2018లో డిజిటల్ ఆన్‌లైన్ పట్టా పాస్ పుస్తకం కూడా వచ్చింది. బ్యాంకుల్లో 15 ఏళ్లుగా పంటరుణం తీసుకుంటున్నారు. అయినప్పటికీ అటవీ అధికారులు పత్తి మొక్కలను ధ్వంసం చేశారని గిరిజన రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. అటవీ అధికారులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఈ విషయంపై కుశ్నపల్లి డెప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణను వివరణ కోరగా పీకేసిన పత్తికి, అటవీ సిబ్బందికి ఎలాంటి సంబంధం లేదన్నారు. పత్తిని తొలగించాలనుకుంటే తమ సిబ్బంది రెండు నెలల క్రితమే తొలగించే వారన్నారు. ఆరోపణలు అవాస్తవమన్నారు.

మానవత్వం చాటిన పోలీసులు



బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న పోలీసులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద బాలుడికి ఫిట్స్ రావడంతో అతని తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే అక్కడికి చేరుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది బి.రవి, జి.చంద్రశేఖర్ బాలున్ని ఎత్తుకుని బైక్‌పై సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించి పంపించారు. కాగా బాలునికి జ్వరం రావడంతో బుధవారం సాయంత్రం తల్లిదండ్రులు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా సీసీసీ కార్నర్ వద్ద ఈ సంఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. సకాలంలో స్పందించిన బ్లూకోల్ట్స్ సిబ్బందిని ఎస్సై నెల్కి సుగుణాకర్, పోలీసు సిబ్బంది, స్థానికులు అభినందించారు.



పర్యాటకులను ఆకర్షించడంతో పాటు సాహసికులకు ఆహ్లాదం పంచాలనే ఉద్దేశంతో మావల మండల కేంద్రంలోని హరితవనంలో ఏర్పాటు చేసిన జిప్ సైక్లింగ్ ట్రాక్ తప్పింది. అధికారుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో కేవలం ఆరంభానికే పరిమితమైంది. పరికరాలు వృథాగా మారాయి. ఫలితంగా సాహసికులకు సైక్లింగ్ అందని ద్రాక్షగానే మారింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్